క్లుప్తంగా

ఘనంగా మార్టూరు నూకాంబిక అమ్మవారి పండగ



మార్టూరు నూకాంబిక అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కన్నబాబు,తేజ తదితరులు

అచ్యుతాపురం : మండలంలోని మార్టూరు గ్రామంలో గురువారం నూకాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లారమ్మ తల్లి జాతర



భక్తులకు దర్శనమిచ్చిన ఎల్లారమ్మ తల్లి

రాంబిల్లి: నేవీ పునరావాసకాలనీలో గురువారం ఎల్లారమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

23న మునగపాకలో ఉచిత మెగా వైద్య శిబిరం

మునగపాక : మండల కేంద్రంలో ఈ నెల 23న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంఎస్ఆర్ ఐటీఐ కరస్పాండెంట్ మళ్ల జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాకకు చెందిన డాక్టర్ మళ్ల మురళీకృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. పలు విభాగాలకు సంబంధించి నిష్ణాతులైన వైద్యులు వైద్య సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జోగారావు కోరుతున్నారు.

పాఠశాలకు ఫ్యాన్ వితరణ



ఫ్యాన్‌ను అందిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలకు సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి శివబాపునాయుడులు టవర్ ఫ్యాన్‌ను వితరణ చేశారు. సర్పంచ్ మనవడు జన్మదిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. శేఖర్, మారిసెట్టి వెంకట అప్పారావు, అరుణ, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విజయానికి పాటుపడాలి

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం కోసం పాటుపడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ కుమార్ కోరారు. మండలంలోని ఉమ్మలాడకు చెందిన పలువురు యువకులు గురువారం జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు తొడిగి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రజలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం కుట్రలు

అనకాపల్లి: విశాఖఉక్కును కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సొంత గనులు ఇవ్వకుండా ఇక్కట్లకు గురి చేసిందని పేర్కొన్నారు. నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని ఉక్కుమనుగడకు తోడ్పాటునందించాలన్నారు.

ఉద్దండపురంలో గ్రామస్వరాజ్యం



జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు

- అన్ని సేవలు ప్రజలకు చేరువలో..
- కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు
- జగనన్న ప్రభుత్వంలో మారిన గ్రామ రూపురేఖలు

మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామం ఉద్దండపురం. ఈ గ్రామంలో జనాభా సుమారు 4వేలకు పైబడే. ఓటర్లు కూడా సుమారు 2500 ఉన్నారు. జాతీయరహదారిని ఆనుకుని ఉన్నప్పటికీ తరతరాలుగా మారని పల్లెల్లో ఇది కూడా ఒకటి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈగ్రామం నుంచి ఎంపీపీ పదవిని చేపట్టిన వారు కూడా ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం ఆమడ దూరంలోనే ఉండేది. ఈ గ్రామంలో స్థానికంగా పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు ఎక్కువగా వలస పోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ రూపురేఖలు మారిపోయాయి.



గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

నక్కపల్లి : ఒకనాటి కష్టాలు లేక గ్రామానికి కొత్త కళ వచ్చింది. ప్రజల ముఖాల్లో ధైర్యం, భరోసా కనిపిస్తున్నాయి. ఎవరి వద్దకు వెళ్లి నాకు పలానా పనిచేసిపెట్టండి అని ప్రాధేయ పడాల్సిన అవసరం లేదు. అన్నీ సేవలు కాళ్ల దగ్గరకే వస్తున్నాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న ప్రభుత్వం సాకారం చేసింది. రైతులు, విద్యార్థులు, అవ్వాతాతలు, వ్యాపారాలు చేసుకునేవారు ఇలా ఎవరికి ఏ అవసరం వచ్చిన స్థానికంగా జగనన్న ప్రభుత్వం నిర్మించిన సచివాలయంలో జరిగిపోతున్నాయి. కుల ఆదాయ నివాస ధ్రువపత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, వన్‌బి కాపీలు, వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, పింఛన్లు, రుణాల కోసం దరఖాస్తులు ,అన్ని సచివాలయంలోనే జరుగుతున్నాయి.

అన్నదాతలకు భరోసా

గతంలో విత్తనాల కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గొడిచర్ల పీఏసీఎస్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు రైతు రైతుభరోసా కేంద్రంలోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సరఫరా చేస్తున్నారు. పశువులకు వెటర్నరీ అసిస్టెంట్ గ్రామంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మవడి, చేదోడు, కాపు నేస్తం, నేతన్న నేస్తం, వాహన మిత్ర, తదితర పథకాలతో బడుగు బలహీన వర్గాల వారికి ఎంతో చేకూరింది.

నెరవేరిన సొంత ఇంటి కల

పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ, జగనన్న కాలనీలు ఏర్పాటు ద్వారా సొంతింటికల నెరవేరింది. 42మందికి ఈ ప్రభుత్వంలో ఇళ్లస్థలాలు పంపిణీ చేసారు. జగనన్న కాలనీ ఏర్పాటు చేసి రోడ్లు, తాగునీరు, వాడుకనీరు, విద్యుత్ సదుపాయం కల్పించారు. అలాగే సొంత స్థలం కలిగిన 120 మందికి ఇళ్లుకట్టుకునేందుకు ఆర్థిక సాయం మంజూరు చేయడంతో చాలా మంది సొంతఇల్లు నిర్మించుకున్నారు.

రూ.1.50 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

నాడు నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. గతంలోఈ పాఠశాలలో వసతి కోసం చాలా ఇబ్బంది పడేవారు. నాడునేడు ద్వారా సుమారు రూ.1.50 కోట్లతో అదనపు భవనాలు, మరుగుదొడ్లు, తాగునీరు, వాడుకనీరు, తదితర ఆధునిక సదుపాయాలు కల్పించారు.

గ్రామంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు

సచివాలయం రూ.24 లక్షలు
రైతు భరోసా కేంద్రం రూ.21 లక్షలు
హెల్త్‌సెంటరు రూ.20 లక్షలు
నాడు నేడు పాఠశాలల నిర్మాణానికి రూ.1.50 కోట్లు
తాగునీటి పథకాలకు రూ.1.25కోట్లు
సీసీ రోడ్లు,కాలువల నిర్మాణానికి రూ.40లక్షలు
జగనన్నకాలనీలో లబ్ధిదారులు 42 మంది
సొంతస్థలంలో ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులు 120 మంది
పింఛన్లు పొందుతున్న వారు 690 మంది
అమ్మవడి 423 మంది
జగనన్న విద్యాదీవెన 209 మంది
జగనన్న వసతి దీవెన 157 మంది
వైఎస్సార్ రైతు భరోసా 562 మంది
సున్నా వడ్డీ 196 మంది
వైఎస్సార్ చేయూత 103 మంది
వైఎస్సార్ ఆసరా 765 మంది
కాపునేస్తం 283 మంది
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 144 మంది
వైఎస్సార్ వాహన మిత్ర 47 మంది





గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్

రూ.1.25 కోట్లతో తాగునీటి కుళాయిలు

ఉద్దండపురంలో నీటి ఎద్దడి గతంలో తీవ్రంగా ఉండేది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చేక రూ.1.10 కోట్లతో జల్ జీవన్‌మిషన్ కింద ఇంటింటికి కుళాయి పథకం ఏర్పాటు చేశారు. అలాగే రూ.15లక్షలు పంచాయతీ నిధులతో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, కొత్తకాలనీల్లో ప్రత్యేకంగా మినీ వాటర్‌ట్యాంకులు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించారు.



ఇంటింటికి కుళాయిల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

వైద్య అవసరాల కోసం హెల్త్‌సెంటరు

గ్రామస్తుల ఆరోగ్య సమస్యలు స్థానికంగా పరిష్కరించేందుకు హెల్త్ సెంటరు కూడా నిర్మించారు. ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు వారి చెంతనే వైద్య సాయం అందిస్తున్నారు.

రూ.40 లక్షలతో సీసీ రోడ్లు

గత ప్రభుత్వంలో అయితే సరైన రోడ్లు ఉండేవి కావు. వర్షాకాలం వస్తే మోకాలి లోతు నీటిలో నుంచి రాకపోకలు సాగించాల్సి వచ్చేంది. సరైన రోడ్లు, కాలువలు లేక వర్షపునీరు ఇళ్లల్లోకి చేరేది. ఇప్పుడా పరిస్థితి లేదు. గ్రామంలో అన్ని వీధుల్లోను కాలనీల్లోను గడప గడపకు ప్రభుత్వం అలాగే పంచాయతీ నిధులు, మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు నిర్మించి గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

పింఛను కోసం పాట్లు తప్పాయి



మాది ఉద్దండపురం గ్రామం. పింఛను కోసం పంచాయతీ కార్యాలయం వద్ద రోజంతా పడిగాపులు పడాల్సి వచ్చేది. మిషన్ పనిచేయకపోతే మర్నాడు రమ్మనేటోళ్లు. అలా వారం రోజుల వరకు కూడా పింఛను డబ్బులు ఇచ్చేటోళ్లు కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీరు ప్రతినెలా ఒకటోతేదీనే ఇంటికి తెచ్చి పింఛను డబ్బులు ఇచ్చేత్తన్నాడు. గతంలో తెలుగుదేశం పెబుత్వంలో అయితే పింఛను మంజూరు చేస్తే మొదటి నెల పింఛను నాయకులకు ఇచ్చేయాలి లేదా సగం డబ్బులైనా ఇవ్వా లి. ఊర్లో ఎవరైనా చనిపోతే వారి పింఛను తెలుగుదేశపోళ్లకే పెట్టుకునేవోళ్లు. ఇప్పుడు అలా లేదు. 60 ఏళ్లు దాటితే ఆధార్‌కార్డు పట్టుకుని సచివాలయానికి ఎల్తే కంప్యూటర్‌లో ఎక్కిస్తున్నారు. పింఛను ఎవరి కాళ్ల వద్దకు వెళ్లకుండానే మంజూరవుతోంది. వలంటీరు వచ్చి మీకు పింఛను మంజూరయిందని చెప్పే పరిస్థితి ఉంది. ఇంతకంటే మాకు ఏం కావాలి. ఏపని కావాలన్న పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలాపీసుకు వెళ్లేపనిలేదు. అన్ని ఇక్కడే జరుగుతున్నాయి. 2019లో రూ.2250 ఇచ్చేవారు. అలా పెంచుకుంటూ వచ్చి ఇప్పుడు నాకు మూడు వేల రూపాయలు ఇస్తున్నారు.

–పొదగట్ల సూరిబాబు, పింఛను లబ్ధిదారు

ఇన్నాళ్లకు సొంతిల్లు కట్టుకున్నా...



నాకు సొంత స్థలం ఉంది. ఇల్లు కట్టుకునే స్థోమత లేక పూరిగుడెసెలోనే కాలం వెళ్లదీసేవాడిని, జగనన్న ముఖ్యమంత్రి అయ్యేక సొంత స్థలం ఉంటే ఇల్లుకట్టుకోడానికి డబ్బులిత్తారని వలంటీరు సెప్పేడు, సచివాలయానికి వెళ్లి కాగితం పెట్టుకున్నాను. నాకు ఇల్లు మంజూరు చేశారు. ఆర్థిక సాయం ఇచ్చేరు. జగనన్న ఇచ్చిన డబ్బులకు నేను కూడబెట్టుకున్న కొంత డబ్బు కలిపి సొంతిల్లు కట్టుకున్నాను. దాదాపు ఇరవై ఏళ్లు ఇల్లు కోసం తిరిగేను పనవ్వలేదు. జగనన్న దయ వల్ల ఇన్నాళ్లకు సొంతిల్లు నిర్మించుకునే అవకాశం వచ్చింది.

–మిరియాల అశోక్, లబ్ధిదారుడు

అద్దె ఇంటి తిప్పలు లేవు



మాది పేద కుటుంబం. రెక్కాడితేకాని డొక్కాడదు. సొంత స్థలం లేక ఇల్లు కట్టుకోలేదు. అద్దెంట్లో ఉండేటోళ్లం. ఎవరిని అడగకుండానే వలంటీరు ద్వారా జగనన్న పెబుత్వంలో మాకు ఇంటి స్థలం ఇచ్చేరు. ఇల్లు కట్టుకోడానికి కూడా డబ్బులు ఇచ్చేరు. జగనన్న కాలనీలో సొంత ఇల్లు కట్టుకుంటున్నాం. జగనన్న దయ వల్ల మాకు ఒక సొంత ఇల్లు సమకూరింది. ఇంత కంటే ఏం కావాలి.. గత పెబుత్వంలో అయితే ఎమ్మెల్యేలు, నాయకుల చుట్టు నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని మాకాళ్ల దగ్గరకే వత్తన్నాయి. జగనన్న మళ్లీ రావాలి.

–కూనిసెట్టి దుర్గ, లబ్ధిదారు

గ్రామాన్ని అభివృద్ధి చేసే భాగ్యం దక్కింది



గతంలో ఈ గ్రామంలో ఎక్కువ పర్యాయాలు తెలుగుదేశం పార్టీకి చెందిన వారే ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు.

కానీ దురదృష్టవశాత్తూ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో నేను సర్పంచ్‌గా ఎన్నికయ్యే భాగ్యం కలిగింది. దీంతో సర్పంచ్‌గా గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే అవకాశం కలిగింది. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌సెంటరు, ఇంటింటికి కుళాయిలు, సీసీ రోడ్లు, పేదలకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు,ఒకటి కాదు ఇలా అన్నిరంగాల్లోను అభివృద్ధి చేసే అదృష్టం జగనన్న దయవల్ల దక్కింది.

–పొదగట్ల వెంకటేష్, సర్పంచ్ ఉద్దండపురం

మౌలిక సదుపాయాలు కల్పించాం



మండల పరిషత్ నిధుల నుంచి గ్రామంలో పలు వీధుల్లో సీసీ రోడ్లు వేశాను. పలువురికి పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయించగలిగాను. ఏ చిన్న అవసరం వచ్చిన సచివాలయంలోనే పని జరుగుతోంది. రైతులకు ఆర్‌బీకేలోనే అన్ని అందిస్తున్నాం. ఈ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ప్రతినిధిగా ఉన్నందుకు గర్వంగా ఉంది.

–బచ్చలరాజు, ఎంపీటీసీ

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



పట్టణంలో కవాతు చేస్తున్న సాయుధ బలగాలు

యలమంచిలి : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం కల్పించడంలో భాగంగా యలమంచిలి పట్టణంలో గురువారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ఫ్లాగ్‌మార్చ్ పట్టణంలో పాతవీధి, పాత జాతీయ రహదారి, కాకివానివీధి, ధర్మవరం, రైల్వేస్టేషన్ మీదుగా గాంధీనగరం వరకు డీఎస్పీ భవ్య, యలమంచిలి సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని ప్రజలందరికీ ఎన్నికల నియమావళి అనుసరించి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలందరి సహకారం అవసరం అని ఎన్నికల కోడ్ విధిగా పాటించాలని పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలందరికీ ప్రశాంత ఎన్నికలపై భరోసా కల్పించే విధంగా ఈ మార్చ్ జరుగుతుందని అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కవాతులో యలమంచిలి పట్టణ పోలీసులు, రూరల్ స్టేషన్ పోలీసులు పాల్గొన్నారు.


పోషకాహారం ప్రాధాన్యాన్ని గుర్తించాలి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సౌజన్య

రాంబిల్లి : పోషకాహారం ప్రాధాన్యాన్ని అందరూ గుర్తించాలని టాటా సంస్థ , ఏషియన్ పేయింట్స్ కో ఆర్డినేటర్ సౌజన్య అన్నారు. పంచదార్ల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహారం–ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ, ఆరోగ్యంగా వుండాలంటే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పలు రకాల పోషకాహార పదార్థాలను తీసుకువచ్చి వాటిని ప్రదర్శించారు. మంచి పోషకాహార పదార్థాలను ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ సంతోషి, పోషణ సఖిలు ధనలక్ష్మి, దేవి అంగన్‌వాడీ ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య నియంత్రణకు వినతి



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచి ప్రజలకు భద్రత, రక్షణ కల్పించాలని డీఎస్పీ ఎస్.అప్పలరాజుకు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు గురువారం కోరారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయనకు మర్యాదపూర్వకంగా శాలువా కప్పి, వినతిపత్రం అందించారు. నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత ప్రమాదాల తోపాటు ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. అంతకుముందు మెయిన్ రోడ్డు సీతారామాలయంలో సీతారాములను దర్శించుకుని, ప్రజలకు ప్రమాదాలు జరుగకుండా కాపాడాలంటూ ప్రార్థించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం, కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించండి



కూరగాయల వర్తకులను పరిచయం చేసుకుంటున్న కంబాల జోగులు

పాయకరావుపేట : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలో గల లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం ఆహ్వానం మేరకు మాల్‌ను సందర్శించారు. అనంతరం పట్టణంలో మెయిన్‌రోడ్డు ప్రక్కన వున్న కూరగాయల వ్యాపారుల వద్దకు వెళ్లారు. వారిని పరిచయం చేసుకున్నారు. సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఈయనతో పాటు పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

ఎస్.రాయవరం : టీడీపీ,జనసేన నాయకులు రోజుకో మాట, పూటకో వేషం వేస్తూ కార్యకర్తలను ముప్పతిప్పలు పెడుతున్నారని చెబుతూ భీమవరం గ్రామం నుంచి సుమారు 50 కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పోలినాటి కృష్ణ,శరకం నాని, గంగాధర్, భీశెట్టి భద్ర, అతికంశెట్టి శ్రీనివాసరావు, నానాజీ, పవన్, ఉగ్గిన జాన్‌లతో ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి చేసిన సంక్షేమం ,అభివృద్ధి మరెవరూ చేయలేదని చెప్పారు. పార్టీలో 15 ఏళ్లుగా కష్టపడుతున్న టీడీపీలో కనీసం గుర్తింపు లేదని టీడీపీ నాయకులు, పార్టీ పుట్టినప్పటి నుంచి జనసేనలో కొనసాగుతున్న తమకు గౌవరం లేదని జనసేన నాయకులు ఎమ్మెల్యేకి వివరించారు. ప్రతి పక్షంలో తామంతా ఉన్నప్పటికి గ్రామ వలంటీర్ల ద్వారా అన్ని ప్రభుత్వ పథకాలు తమ కుటుంబాలకి అందించారని కొనియాడారు. గ్రామంలో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. ఎంపీపీ లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, జిల్లా పార్టీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అప్పన్న, మండల యూత్ అధ్యక్షుడు వెంకటరాజు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, వైబోయిన సత్యనారాయణ పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గరగా శ్రీను, మధువర్మ, బాబి, చొప్పా రాజు, వెంకటరమణ, బొండా దివాణం పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవం

కోటవురట్ల: మండలంలోని కన్నూరుపాలెం శివారు పాత కన్నూరుపాలెంలో గురువారం ముత్యాలమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి, పూజలు చేశారు. రవికెలు, చీరలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు.

హైవే డివైడర్‌పై గ్రిల్స్ పెట్టరూ..



కేఎస్ఆర్ పేట హైవే డివైడర్ మధ్యలో గ్రిల్స్ లేని దృశ్యం

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామం కేఎస్ఆర్ పేట జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు డివైడర్ మధ్యలో గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని గ్రామ పెద్ద వి.ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. అనకాపల్లి నుంచి విశాఖకు కేఎస్ఆర్ పేట మీదుగా నిత్యం వేలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రోడ్డు దాటే సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మధ్యలో గ్రిల్స్‌ను ఏర్పాటు చేసి, ప్రమాదాలను అరికట్టాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల: మండలంలోని తేగాడలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి, శారదా వ్యాలీ డెవలప్‌మెంటు సమితిల ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంఏఎల్ కళాశాలలో అగ్రికల్చరల్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు సేంద్రియ వ్యవసాయ సాగుపై స్థానిక విద్యార్థులకు వివరించారు. సమితి కోఆర్డినేటర్ కోన అప్పారావు, ఐసీఆర్‌పీలు సీహెచ్ నాగరాజు, కన్నయ్యమ్మ, పి.అప్పారావు, ఎల్.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.